### రెవెన్యూ అధికారులు కార్యశాల

# ఒక నిర్ణాయక పాత్రకు వేదికగా నిలవాలి

- అర్జీల పరిష్కార మార్గం నిజ నిర్ధారణ చేసుకోవాలి
- పరిష్కార దిశలో మధ్యవర్తుల ప్రమేయాన్ని నివారించాలి
- ఫలవంతమైన దిశగా ఒక రోజు రెవెన్యూ అధికారులు కార్యశాల
- అర్జిల పరిష్కార విషయంలో ఖచ్చితత్వం, జవాబుదారీతనం కలిగి ఉండాలి -జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి




**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ఏదైనా ఒక సమస్య వొస్తే దాని స్థాయినీ కూడా అంచనావేసి ఆస్థాయిలో ప్రతిస్పందన ఉంటే తప్పకుండా పరిష్కారం అవుతుందని, హేతుబద్ధత కలిగిన పరిష్కారం చేసినప్పుడే భూ సమస్యలకి, ఇతర సమస్యలకు పరిష్కారం సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు.స్థానిన కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అధ్యక్షతన రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అంశాల పరిష్కార మార్గాలపై వర్క్ షాప్ (కార్యశాల) జాయింట్ కలెక్టర్ ఎస్‌చిన్న రాముడు, డిఆర్వోటి సీతారామ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిప్రశాంతి మాట్లాడుతూ,రెవెన్యూ అధికారులు కార్యశాల నిత్యకృత్యమైన సమావేశాలలా కాకుండ ఫలవంతం అయ్యే విధంగా ఒకనిర్ణాయక పాత్ర పోషించాలనీ ఆదేశించారు.సమస్య పరిష్కారంకోసం ఎస్‌వోపి (ప్రామాణికఆపరేటింగ్‌విధానం) మార్గదర్శకాలు జారీచేయడం జరుగుతుందని, అయితే వాటిపైనే ఆధారపడ కుండా క్షేత్రస్థాయిలో రెవిన్యూ అధికారులు సముచిత నిర్ణయం తీసుకోవడం ద్వారా తదుపరి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.వాటి ఆచరణాత్మక విషయాలను పరిగణనలోనికి తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. భూముల విషయంలో సర్వే నంబర్, ఎల్‌పిఎం నెంబర్ ప్రకారం సబ్ డివిజన్ చెయ్యాల్సి ఉందన్నారు. పిజి ఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం దిశగా నాణ్యత మెరుగుపరచడానికి సరైన వ్యూహం రూపొందించడం జరగాలన్నారు.ఇప్పటి వరకు గత ఎనిమిది నెలలుగా పరిపాలనా విధానంలో వివిధ స్థాయిల్లో పరిష్కారం చూపించినా, ఇంకా సంతృప్తి స్థాయి వ్యక్తం చేయడంలో సమస్యలు చూస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రవేటు

- తరువాయి 2లో..

### రావులపాలెంలో వ్యాపారి

# కిడ్నాప్ కలకలం



**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** ప్రశాంత వాతావరణానికి ప్రసిద్ధి చెందిన కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో కిడ్నాప్ కలకాలం బెంబేలెత్తించింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రావులపాలెం ఆదిలక్ష్మి నగర్ ఐదవ వీధికి చెందిన సిరగం శ్రీరామ్ అలియాస్ రమేష్ నాలుగు సంవత్సరాల క్రితం మహారాష్ట్రకు చెందిన సంజయ్ అనే అసామితో వ్యాపారం చేసినట్లు,ఆ క్రమంలోనే బాకీ పడినట్లు, దాని గురించి సంజయ్ వేధిస్తున్నట్లు, వీరిద్దరూ పెద్ద మనుషులు సమక్షంలో మాట్లాడుకోగా, ఆ వ్యవహారం ఎటు తేలకపోవడంతో రమేష్‌తండ్రి సిరగం మురళీహర సుబ్బారావు బుధవారం అర్ధరాత్రి 12:30గంటల సమయం లో ఫోన్ చేసిషాపు ముగించుకొని ఇంటికి వస్తున్నట్లు చెప్పాడు, ఐతే ఎంతసేపటికి ఇంటికి రాకపోయేసరికి రమేష్ తన తండ్రిని వెతుకుతూ షాపు వద్దకు వెళుతుండగా మార్గమధ్యంలో గునిశెట్టి నాగేంద్ర ఇంటి సమీపంలో తన తండ్రి యొక్క మోటారుసైకిల్, చెప్పులు, కళ్ళజోడు పడి ఉన్నట్లు గ్రహించారు. రమేష్ తెల్లవారుజామున వరకు గాలించారు.

గురువారం ఉదయం 7:49 నిమిషములకు అతని తండ్రి కుమారుడు రమేష్‌కు ఫోన్ చేసి మనం బాకీ పడియున్న సంజు అతని మనుషులు కారులో వచ్చి మోటార్ సైకిల్‌పై వెళుతున్న తనను అడ్డగించి బలవంతముగా కారులో ఎక్కించుకుని మహారాష్ట్ర తీసుకుని వెళుతున్నట్లు చెప్పి, వెంటనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు తర్వాత రమేష్ విచారించగా గంటి గ్రామస్థుడైన రుద్ర సురేష్ అతని ద్వారా సంజు మనుషులు సంజయ్, రమేష్, గోపయ్య మొదలగు వారు కారులో వచ్చి తన తండ్రిని కిడ్నాప్ చేసుకొని వెళ్ళిపోయినట్లు, ఈ విషయమై ఫిర్యాదు స్టేషన్లో రిపోర్టు ఇవ్వగా, దానిపై రావులపాలెం ఎస్సై కేవీ రమణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తుందని రైతుల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకొస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని లొల్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల ద్వారా రబీ సీజన్ ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ధాన్యం ఎక్కడో సుదూర ప్రాంతాల మిల్లుకు తీసుకెళ్లేవారని గుర్తు చేసారు. సరైన పద్ధతి లేక ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

- తరువాయి 2లో..

### క్వారీ లీజుదారులు

# నిబంధనలు పాటించాలి

- ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన మండలాలలో వివిధ రకాల క్వారీలు లీజుకు తీసుకున్న నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో క్వారీలు నిర్వాహకులు, మైనింగ్ అధికారులతో ఐటీడీఏ ప్రాజెక్ట్ కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని 11 మండలాలలో మొత్తం 33 క్వారీలు ఉన్నాయని, ఇందులో 14 క్వారీలు పనిచేస్తున్నాయని, మిగతా 19 క్వారీలు ప్రభుత్వం నుండి అనుమతులు లేని కారణంగా ఆపివేయడం జరిగిందన్నారు. వై.రామవరం, రాజవొమ్మంగి, ఏటపాక, విఆర్ పురం, కూనవరం మండలాల్లో ఏవిధమైన క్వారీలు లేవన్నారు. క్వారీ నిర్వాహకులు క్వారీలు సమీపంలోని

- తరువాయి 2లో..

### 'టూరిజం' అభివృద్ధి ముసుగులో

# 1/70 చట్టానికి చరమగీతం?

- ఆదివాసీ సంఘాల కూటమి నాయకులు ఆరోపణ



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో పాలన మాదే, యజమానులం మేమేనని ఆదివాసీ సంఘాల కూటమి నాయకులు పేర్కొన్నారు.టూరిజంఅభివృద్ధి ముసుగులో 1/70 చట్టానికి చరమగీతం పాడాలని చూస్తేఆదివాసీలు సహించేది లేదన్నారు. ఇండస్ట్రీయల్ ఉపాధి పేరుతో ఆదివాసీలను బానిసత్వంలోకినెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆదివాసీసంఘాలకూటమి నాయకులు గురువారం ఆరోపించారు. 5వ షెడ్యూల్ ఏరియా అయిన ఏజెన్సీ ప్రాంతంలో పాలకులం, యజమానులం తామేనని వారు స్పష్టం చేశారు.

గిరిజన ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలో, ఎలా యజమానులం అవ్వాలో తమకు తెలుసునన్నారు.ప్రస్తుతం ఆదివాసీచట్టాలు సక్రమంగా అమలు చేసి, తమ హక్కులకు భంగం వాటిల్లుకుండా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకుంటేచాలని ఆదివాసీ సంఘాల కూటమి నాయకులు, ఆదివాసీ చైతన్యవేదిక

- తరువాయి 2లో..

# సింగరంపాలెంలో మూడు కోట్ల29లక్షలతో 33/11 కె.వి విద్యుత్ ఉపకేంద్రం

## నూతన సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గండేపల్లి,మేజర్‌న్యూస్ :** సింగరంపాలెం గ్రామంలో మూడు కోట్ల 29 లక్షలతో 33/11 కె.వి విద్యుత్ ఉపకేంద్రం నూతన సబ్‌స్టేషన్‌కు గురువారం జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ భూమి పూజ చేసి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతుల మోహన రావు తన తండ్రి పోతుల వీర్రాజు జ్ఞాపకార్థం ఈ సబ్ స్టేషన్ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని 40 సెంట్లు ప్రభుత్వానికి అందించారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ సింగరం పాలెం గ్రామానికి ఐదు కోట్ల రూపాయల నిధులతో ఇచ్చారని అందులో కోటి 30 లక్షల రూపాయలతోగండేపల్లి సింగరాయపాలెం తారు రోడ్డు వేయడం జరిగిందని మూడు కోట్ల 29 లక్షల రూపాయలతో విద్యుత్ సబ్ స్టేషన్, గ్రామంలో సిమెంట్ రోడ్లు నిధులు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ముఖ్యంగా సింగరంపాలెం, రామయ్య పాలెం, ఎన్ టి రాజాపురం గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్యతో ప్రజలు రైతులు చాలా ఇబ్బందులు గురవుతున్నారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు తెలపడంతో ఆయన వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి ప్రభుత్వానికి నివేదిక పంపించి వెంటనే శాంక్షన్ రప్పించడంతో మా తండ్రి పేరిట 40 సెంట్లు స్థలాన్ని ఇచ్చి సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించమని అన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గండేపల్లి మండలంలో మొత్తం ఏడు సబ్ స్టేషన్లు ఉండగా తెలుగుదేశం ప్రభుత్వం ఆరు నిర్మించింది అని అన్నారు. దీనివల్ల సింగరంపాలెం రామయ్య పాలెం ఎన్ టి రాజా పురం గ్రామాలకు చెందిన దాదాపు మూడు ఫీడర్లలో ఉన్న 400 బోర్లకు సమృద్ధిగా కరెంటు అందుతుందని ఇళ్లకులో వోల్టేజ్ సమస్య తీరుతుం దని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరు సోలార్ విద్యుత్తు ఉపయోగించుకోవాలని దీని కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో కూడిన సోలార్ విద్యుత్ కలెక్షన్లు ప్రతి ఇంటికి అందిస్తుందని ఎస్సీలకు పూర్తి ఉచితంగాను, బీసీలకు 80%, ఓసీలకు 50 శాతం సబ్సిడీ ద్వారాను ఈ సోలార్ విద్యుత్తును అందించేందుకు చర్యలు తీసుకుంటుందని బ్యాంకు రుణం ద్వారా సోలార్ విద్యుత్తు ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కోర్పు సాయి తేజ ,అడబాల భాస్కర రావు, కొత్త కొండబాబు, కుంచె రాజా, కం దుల చిట్టిబాబు, ఎంపీపీ చలగల్ల దొరబాబు, అవసరాల సుబ్రహ్మణ్యం, బొల్లం రెడ్డి రామకృష్ణ, పాలకుర్తి ఆదినారాయణ, యర్రం శెట్టి బాబ్జి విద్యుత్ ఎస్ ఈ గొర్ల ప్రసాద్, ఈ ఈ జగ్గంపేట బలబద్రపు వీరభద్రరావు, డి ఈ ఈ కే మలాకి, డిఈ ఈ కన్స్ట్రక్షన్ బి జ్యోతి, ఏఈ గండేపల్లి ఎస్ కిరణ్ కుమార్, ఏఈ కన్స్ట్రక్షన్ పిమోహన్ అధిక సంఖ్యలో కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మొదటిపేజి తరువాయి

నానా కష్టాలు పడి ధాన్యం పండించి అమ్మితే ఆ సొమ్ము ఎప్పుడు వస్తాదో కూడా అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లోనే రైతుల ధాన్యం రైతుల సమక్షంలోనే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం సొమ్మును రైతుల ఖాతాల్లో వేయడానికి 48 గంటలు సమయం ఇచ్చినా కేవలం రెండు గంటల వ్యవధిలో సొమ్ములు జమ చేయడం జరిగిందని చెప్పారు. ఈ రబీ సీజన్లో సాధారణ రకం ధాన్యం క్వింటాకు 2300 రూపాయలు, 75 కేజీలకు 1725 రూపాయల చొప్పున కనీస మద్దతు ధర ఇస్తున్నామన్నారు. అలాగే ఎరకం గ్రేడ్ ధాన్యం క్వింటాకు 2320 రూపాయలు, 75 కేజీలకు 1740 రూపాయలు కనీస మద్దతు ధర ఉందన్నారు. అంతే కాకుండా గోనె సంచుల, హమాలీ రవాణా చార్జీలను రైతుల ఖాతాల్లోకి చెల్లించే వెసులుబాటును కూటమి సర్కార్ కల్పించిందని తెలిపారు. రైతే రాజు అన్న మాటను నిజం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, జిల్లా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు కరుటూరి నరసింహారావు, లొల్ల సర్పంచ్ కాయల జగన్నాధం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# క్వారీ లీజుదారులు నిబంధనలు పాటించాలి

మొదటిపేజి తరువాయి

గ్రామాల అభివృద్ధి, రోడ్లు, సేఫ్టీ, ప్రభుత్వ నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న క్వారీలలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్వారీలకు ప్రతి సంవత్సరం ఎన్ని నిధులు వస్తున్నాయి, అదేవిధంగా ఏ విధంగా క్వారీలు నిర్వహిస్తున్నారు పిఓ ఆరా తీశారు. ఈసమావేశంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ ప్రతి క్వారీకి ప్రభుత్వ నిబంధనలు ప్రకారం సొసైటీ ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం నుండి అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రస్తుతం క్వారీలు నిర్వహిస్తున్న యాజమాన్యం ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేసుకోవాలన్నారు. క్వారీ యాజమాన్యం వాటి నిర్వహణ కొరకు ఏవిధంగా శిక్షణ తీసుకున్నది, అదేవిధంగా లైసెన్స్ ఏవిధంగా తీసుకున్నది ఆమె ఆరా తీశారు. క్వారీలు ఉన్న పంచాయితీలు పరిధి లోని గ్రామాలలో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం వచ్చిన ఆదాయంలో స్కూల్స్ అభివృద్ధి, రోడ్లు ఏర్పాటు, ఆయా గ్రామ ప్రజలకు ఆరోగ్యం పై నిధులు ఉపయోగించాలన్నారు. కొత్తగా క్వారీలు తీసుకునేవారు ఆయా గ్రామాలలో పీసా గ్రామసభలు ద్వారా తీర్మానాలు చేసి అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నిబంధనలు పాటించని క్వారీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి యం.ఆనంద్, సర్వేయర్ కాళిదాసు, క్వారీ యాజమాన్య ప్రతినిధులు కోసూరి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉపకరణాల అందజేత

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రత్యేక అవసరాలగల పిల్లలు తమ దైనందిన జీవితంలో ఎవరి మీద ఆధారపడకుండా తమ పనులు చేసుకునేందుకు ఉపకరణాలు ఎంతగానో సహాయపడతాయని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు.

గురువారం కాకినాడ సాలిపేట మున్సిపల్ బాలికల పాఠశాలలో జిల్లా పాఠశాల విద్యాశాఖ– సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకారణాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ జీ.నాగమణి, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, సమగ్రశిక్ష పీఓ పీ.వేణుగోపాల్, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధులశాఖ ఇన్చార్జి ఏడీ, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు తదితరులతో కలిసి హాజరై, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అలెన్కో సంస్థ ద్వారా సమకూర్చిన వీల్ చైర్స్,ట్రైసైకిల్, వినికిడి యంత్రాలు, టీఎల్ఎం కిట్లు ఇతర ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మేనరిక వివాహాలను రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. జన్యుపరమైన, ప్రమాదాల కారణాలు మాత్రమే కాకుండా ఎక్కువ శాతం మేనరికం, దగ్గర దగ్గర బంధువులతో పెళ్లిళ్లు చేసుకోవడం ద్వారానే వివిధ రకాల లోపం కలిగిన చిన్నారులు జన్మిస్తున్నారని ఆయన తెలిపారు. కాన్పూర్ లో ఉన్న అలెన్ కో సంస్థ, సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అవసరాలగల పిల్లలకు, దివ్యాంగులకు అవసరమైన పరికరాలను ఉచితంగా అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు అనేక సందర్భాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, సుమారుగా రూ.3 కోట్లు విలువైన పరికరాలను ఈ సంస్థ ద్వారా ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పరికరాల ద్వారా ప్రత్యేక అవసరాలుగల చిన్నారులు తమ దైనందిన జీవితంలో ఎవరి మీద ఆధారపడకుండా తమ పనులు చేసుకునేందుకు ఈ ఉపకరణాలు ఎంతగానో సహాయపడతాయని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 272 మంది ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు 34 రకాల ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాలగల విద్యార్థులను జిల్లాలో భవిత కేంద్రాల ద్వారా ఐఈఆర్టీలు, తల్లిదండ్రులు సమక్షంలో అవసరమైన విద్యాబోధనలు, ఫిజియోథెరపీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో అలెన్ కోప్రతినిధి రాజబాబు, ఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, విద్యాశాఖ అధికారులు బి.శివప్రసాద్, జి.పైడిరాజు, జీసీడీఓ పి.ఉమామహేశ్వరి, ఏఎస్వో కె.జోగి రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారులు కార్యశాల

## ఒక నిర్ణాయక పాత్రకు వేదికగా నిలవాలి

మొదటిపేజి తరువాయి

భూముల పరాయీకరణ (ఎలినేషన్) కోసం అర్జీలు స్వీకరించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తాళ్లపూడి మండలంలో వైట్ ఫీల్డ్‌స్థలాలు ఇతరులకి కేటాయింపు చెయ్యాలని,అనపర్తి నియోజక వర్గంలో వ్యర్థాల నుంచి సంపద సృష్టి కోసం కేటాయించిన భూములు కేటాయింపు చెయ్యవద్దు అని పిజిఆర్ఎస్‌లో విభిన్న అర్జీలు ఇవ్వడం జరిగిందన్నారు.ఏదైనా ఒక ప్రత్యేక కార్యక్రమం కోసం కేటాయించిన భూములు వినియోగం చెయ్యని సందర్భంలో పరాయీకరణ కోసంఅర్జీలు,దరఖాస్తులు రావడం జరుగు తోందని తెలిపారు. రెవిన్యూ పరంగా పారదర్శకంగా పిటిషనర్ యొక్క ఫిర్యాదుల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక ఖచ్చితంగా పాటించాలని కలక్టర్ స్పష్టం చేశారు. కార్యాశాల సందర్భంగా ప్రైవేట్ భూములను 22(ఎ) జాబితాలో ఉంచడం,22ఎ ఫిర్యాదును పరిష్కరించే వ్యూహం (కేటగిరీ వారీగా), అసైన్‌మెంట్, ఫ్రీహోల్డ్ భూములతో సహా అన్ని అసైన్‌మెంట్ సమస్యలు, భూమి పరాయీకరణ,భూమి క్రమబద్ధీకరణ ,,ఆర్‌వోఆర్ ఇనామ్స్ మరియు ఎస్టేట్ రద్దు–వెబ్‌ల్యాండ్ సమస్యలు ఈ సందర్భంగా పలువురు తహశీ ల్దార్లు చేసిన సూచనలు సలహాలు వివరాలతో కూడిన సమగ్ర ఎస్ వో పి సిద్ధం చేసుకుని సమర్ధవంతం పిజి ఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కా రం దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వర పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం, సీసీఎల్ఏ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.సమస్య పరిష్కారం దిశలో అధికారుల స్థాయిలో కాకుండా క్షేత్ర స్థాయి నుంచి సమగ్ర సమాచారం తెలుసుకుని పరిష్కారం చూపాలని సూచించారు. ముఖ్యంగా రైతుల నుంచి తమ భూములను 22 ఏ, అనుబంధ జాబితా నుంచి తొలగించాలని అర్జీలు వొస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నా వారికి జీవో 35 ప్రకారం క్రమ బద్ధీకరణ కోసం మార్గదర్శకాలు విడుదల చెయ్యడం జరిగిందన్నారు. కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ భాస్కర్ రెడ్డి, ఆర్డీవోలు కృష్ణ నాయక్, మండలాల తహసిల్దార్, మండల సర్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### 'టూరిజం' అభివృద్ధి ముసుగులో 1/70 చట్టానికి చరమగీతం?

మొదటిపేజి తరువాయి

అధ్యక్షులు వెదుళ్ల లచ్చిరెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు పేర్కొన్నారు. ప్రభుత్వం టూరిజం అభివృద్ధి ముసుగులో 1/70 చట్టానికి చరమగీతం పాడే మార్గం ఏర్పాటు చేస్తుందని, రాజకీయ పార్టీలు వైఖరి, ముఖ్య ఉద్దేశ్యం 1/70 చట్టాన్ని సవరణ చేయడమేనని వారు ఆరోపించారు. గతంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడిన తీరు, ఆతర్వాత అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడిన తీరు, గతంలో వైకాపా అనుసరించిన విధానం, గిరిజనేతరులు ఆశయం 1/70 చట్టాన్ని తొలగించడమే అని వారు అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని 5వ షెడ్యూల్ ఏరియా కాబట్టే ప్రత్యేకమైన చట్టాలు, హక్కులు ఉన్నాయని, ప్రత్యేకమైన పరిపాలన విధానం, ఆదివాసీల సాంస్కృతి, సంప్రదాయాలు, హక్కులు, చట్టాలు పరిరక్షణ కొరకు పెసా చట్టం ఉందన్నారు. 1/70 చట్టం ప్రకారం ప్రభుత్వం సైతం గిరిజనేతరులతో సమానమని, ప్రభుత్వం నేరుగా ఏజెన్సీ ప్రాంతంలో పరిపాలించడానికి, అధికారం చెలాయించటానికి అవకాశం లేదన్నారు. ఇక్కడి వనరులపై పూర్తి హక్కులు ఆదివాసీలకే ఉన్నాయని, అందుకే రాజకీయ పార్టీలన్ని వార్డు మెంబెర్ నుండి ఎంపీ స్థాయి వరకు ఉన్న ఆదివాసీ ప్రజాప్రతినిధులను అడ్డం పెట్టుకుని ఆదివాసీ చట్టాలను గిరిజన ప్రజాప్రతినిధులతో తొలగించే ప్రయత్నాలు చేస్తున్నాయని వారు విమర్శించారు. ఈ కుట్రలో భాగమే టూరిజం అభివృద్ధి అని, అందుకే 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్న ప్రభుత్వ విధానాలను రాజకీయ పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, పెసా గ్రామసభలు, ఆదివాసీలు తీవ్రంగా వ్యతిరేకించాలని, మా ఊళ్ళో మా రాజ్యం (పాలన) దిశగా ఆదివాసీలందరు కృషి చేయాలని గిరిజన నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీలను ఇండస్ట్రియల్ పేరుతో ఉపాధి దొరుకుతుందని బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని, గిరిజనులకు కావలసింది ఉపాధి కాదు ఉద్యోగాలే కావాలని, ఏజెన్సీ ప్రాంతాలపై ప్రభుత్వానికి అంత ప్రేమ ఉంటే జిఓ–3 స్థానంలో మరో జిఓ తక్షణమే తీసుకొచ్చి చట్టం చేసి యువతకు 100 శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు దృష్టి ఏజెన్సీ స్పెషల్ డిఎస్సీ నుండి మరల్చేందుకు ఇదో ప్రభుత్వ ఎత్తుగడ అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కారం రామన్న దొర తదితరులు పాల్గొన్నారు.

# నేటినుండి శ్రీనారాయణ గిరి కొండపై..శ్రీ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు







**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** మన్యంలో పచ్చని ప్రకృతి అందాల మధ్య సుమనోహరంగా నయనానందకరంగా విరాజిల్లుతున్న శ్రీ నారాయణగిరి కొండపై శ్రీ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 11వ తేదీ నుంచి 5 రోజులుపాటు ఘనంగా నిర్వహించనున్నారు. ద్వారకాతిరుమల ఏలూరు జిల్లా వారి దత్తత దేవాలయమైన శ్రీ నారాయణగిరి వెంకటేశ్వరస్వామివారి దేవాలయం అల్లూరి సీతారామ రాజు జిల్లా రంపచోడవరంలో ఈనెల 11వ తేదీ నుండి 16వ తేదీ వరకు శ్రీ వెంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాలు నిర్వహిస్తున్నారు. 11వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటల నుండి ఉత్సవారంభ స్నపనం, సాయంత్రం 5:30 గంటల నుండి సామూహిక శ్రీ విష్ణు సహస్రనామార్చన అనంతరం శ్రీ విష్వక్సేన ఆరా ధన, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, మృత్సంగ్రహణం, అలాగే 12వ తేదీ శనివారం ఉదయం ధ్వజారోహణము, అగ్ని ప్రతిష్ట, చతుస్థానార్చన, నివేదన, పూర్ణాహుతి, బలిహరణ, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహిస్తారు. సాయంత్రం భేరీతాదనం, దేవతాహ్వానము, పూర్ణాహుతి, నివేదన, నీరాజనం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహిస్తారు. 13వ తేదీ ఆదివారం ఉదయం చతుస్థానార్చన, హెూమము, పూర్ణాహుతి, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి, సాయంత్రం చతుస్థానార్చన, హెూమము, పూర్ణాహుతి, నివేదన, బలిహరణ, నీరాజనం, తీర్థప్రసాదగోష్ఠి నిర్వహిస్తారు. 14వ తేది సోమవారం ఉదయం చతుస్థానార్చన, హెూమము, పూర్ణాహుతి, ఎదుర్కోలు ఉత్సవం,నీరాజనం, తీర్థప్రసాద గోష్ఠి, సాయంత్రం చతుసా ్థనార్చన, హెూమము, పూర్ణాహుతి, వాహన సేవ, నివేదన, నీరాజనం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహిస్తారు. అనంతరం అదే రోజు రాత్రి 7 గంటలకు శ్రీ భూనీళా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం జరుగుతుంది. 15వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుండి చతుస్థానార్చన, నిత్య హెూమము, నిత్య పూర్ణాహుతి, నివేదన, తీర్థప్రసాదగోష్ఠి, సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామార్చన అనంతరం స్వామివారి నిత్య హవనం, పూర్ణాహుతి, తీర్థప్రసాద గోష్ఠి, సాయంత్రం 4గంటలకు శ్రీ స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. 16వ తేదీ బుధవారం ఉదయం చతుస్థానార్చన, హెూమము, మహా పూర్ణాహుతి, పంచవిశంతి, కలశ స్నపనం, చక్రతీర్థోత్సవం, (చక్రస్నానం) బలిహరణ, నివేదన, నీరాజనం, తీర్థప్రసాద గోష్ఠి, సాయంత్రం శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, దేవతోద్వాసన, సప్తావర్ణ ప్రదక్షిణ, ధ్వజా అవరోహణ, కుంభప్రోక్షణ, క్షమా ప్రార్థన, నివేదన, మహా మంగళా శాసనము, ఋత్విక్ సన్మానం, యజ మానులకు ఆశీర్వచనము ఉంటాయి. శ్రీ నారా యణగిరి కొండపై శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించే ఐదు రోజులు ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ పురోహితులు వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్యే రాజప్ప చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేత



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురం మండలం, ఆర్.బి.కొత్తూరు గ్రామ సచివాలయ డబ్ల్యూ.ఇ.ఏగా విధులు నిర్వహిస్తూ మరణించిన చాట్ల సునీల్ కుటుంబానికి ఆర్థిక చేయూత నిమిత్తం ఎంపిడిఓ డి.శ్రీలలిత ఆధ్వర్యంలో సేకరించిన విరాళంను పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా అచ్చంపేటలో గల ఎమ్మెల్యే కార్యాలయం వద్ద చాట్ల సునీల్ భార్యకు అందజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నూనె రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# జనవాసాల్లోకి చుక్కలు జింక

**- ఫారెస్ట్ అధికారులు నుండి తప్పించుకొని అడవిలోకి...**



**రాజవొమ్మంగి, మేజర్‌న్యూస్ :** మండలంలోని సూరంపాలెం గ్రామంలోకి చుక్కల జింక( దుప్పి) పరిగెత్తుకుంటూ వచ్చి ఒక ఇంటలోకి ప్రవేశించిన సంఘటన గురువారం ఉదయం జరిగింది. జింక గ్రామశివారు అటవిప్రాంతం నుండి గ్రామంలోకి ప్రవేశించగానే కుక్కలు వెంట పడడంతో మిస్త్రీ రాజులమ్మ ఇంటికి అమర్చిన కంచిదూకి ఇంటిలోకి ప్రవేశించింది. ఈ విషయం ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎఫ్ ఆర్ ఓ ఉషారాణి ఆధ్వర్యంలో సిబ్బంది హుటా హుటిన వెళ్లి జింకను పట్టుకునే ప్రయత్నం చేయగా తప్పించుకొని అటవీ ప్రాంతంలోకి పారిపోయినట్లు రేంజ్ అధికారిని ఉషారాణి తెలిపారు. తమసిబ్బంది జింకను వెంబడించి రక్షిత అడవి ప్రాంతంలోకి వెళ్లేలా చూశారన్నారు. అలసి ఉన్న సుమారు 5 సంవయసు కలిగిన జింకకు హాని కలగకుండా మరో రెండు రోజుల పాటు ఆ ప్రాంతంలో ప్రొటెక్షన్ ఏర్పాటు చేస్తామని ఫారెస్ట్ అధికారిని తెలిపారు. ఎఫ్ ఎస్ ఓ రాము, ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.

# భూ రీ సర్వే పై అవగాహన ర్యాలీ చేపట్టిన రెవెన్యూ శాఖ

ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : యర్రవరం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమం పై స్థానిక తాసిల్దార్ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. గ్రామ వీధుల్లో రెవెన్యూ శాఖ అధికారులు సర్వే సిబ్బందిపంచాయతీ అధికారులతో ఈ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తాసిల్దార్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుండి యర్రవరం రెవెన్యూ విలేజ్ నందు భూ సర్వే చేపట్టటం జరుగుతుందని తెలిపారు. రేపు గ్రామపంచాయతీ నందు జరగనున్న గ్రామ సభకు రైతులందరూ హాజరుకావాలని కోరారు. ఈ రీ సర్వేలో గతంలో సర్వే మార్పులు, భూ వివాదాలు తదితర అంశాల అవకతవకలపై ఈ రీ సర్వే ద్వారా పరిష్కారం అవుతాయని తెలిపారు. సర్వే అధికారులు రీ సర్వే చేసే సమయంలో రైతులు తమ వద్దఉన్న వ్యవసాయం పాస్ బుక్, ఆధార్ కార్డ్, డాక్యుమెంట్, రికార్డులను తెచ్చి సర్వేకి సహకరించాలని కోరారు,ఈ రీ సర్వే ఆధునిక పద్ధతిలో, అక్షాంశాలు రేఖాంశాలు ఆధారంగా,డ్రోన్, రోవర్ పరికరాలతో చేపట్టడం జరుగుతుందని రీ సర్వే అనంతరం సర్వేనెంబర్ స్థానంలో ఎల్ పి యం (ల్యాండ్ పార్సిల్ మేప్) నెంబర్ వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఆనంద్




కుమార్,ఈ ఓ వర్మ, ఆర్ ఐ పొన్నాలు రీ సర్వేడిటి సంధ్య, వీఆర్వోలు మణికంత, అప్పారావు, మండల సర్వేయర్లు,గ్రామ సర్వేయర్లు సత్యనారాయణ, దుర్గా ప్రసాద్, గ్రామ నాయకులు తదితరుల పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల స్పందనకై సిపిఐ ప్రచార జాత...




సామర్లకోట,మేజర్‌న్యూస్ : భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సామర్లకోటలో పట్టణ సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్ది రెడ్ల సత్యనారాయణ అధ్యక్షతన గురువారం ఉదయం ప్రజా సమస్యలస్పందనకై సిపిఐప్రచారజాతను ప్రారంభించారు. ఈ జాతకు ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. కామిరెడ్డి బోడకొండ ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ల చరిత్ర గల పార్టీ అని, ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసిన ఘనమైన చరిత్ర పార్టీకి ఉందన్నారు. భూ పోరాటాలు, దున్నేవాడికే భూమి, గ్రామీణ ఉపాధి హామీపథకాలు,బ్యాంకులు జాతీయ కరణం తదితర అనేక ఉద్యమాలు చేసిందన్నారు. అర్హులైన పేద ప్రజలందరికీ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు భూమిని, అర్బన్ ప్రాంతాల్లో రెండు సెంట్లు భూమిని ప్రభుత్వం కేటాయించి రూ.5లక్షల రూపాయల ఇల్లు నిర్మాణం కొరకు రుణాలు కేటాయించాలని ఆయన అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని, కాకినాడ జిల్లా అంతటా ఈప్రచారజాత జరుగుతుందని, ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఉద్యమాలు చేపడుతామని ఆయన అన్నారు.

తోకల ప్రసాద్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానాల్లో భాగంగా ఉచిత గ్యాస్ పంపిణీ పథకం అమలు చేస్తూనే మరోపక్క దొడ్డి దారిన నడ్డి విరిచే చందంగా గ్యాస్‌పై రూ.50 అదనంగా పెంచి సామాన్య ప్రజలపై నిలువు దోపిడీ చేస్తున్నారని, పెట్రోల్, డీజిల్ నిత్యవసర అధిక ధరలు వెంటనే నియంత్రించాలని, సామాన్య ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని, రైతులకు ఉచిత విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలలో చదువుతున్న విద్యార్థుల ఫీజు బారాలుతగ్గించాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని, నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, డీఎస్సీ త్వరగా అమలు అమలు చేసి పెండింగ్లో ఉన్న టీచర్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని, స్కూల్ తెరిచే సమయానికి తల్లికి వందనం పథకం అమలు చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునప్రారంభించాలని తదితర డిమాండ్ల సాధనకై ఈ సిపిఐ ప్రచార జాత జరుగుతున్నదన్నారు. ఈ ప్రచార జాతలో సిపిఐ జిల్లా నాయకులు కేశవరపు అప్పలరాజు ఎఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ సూరిబాబు, మడగల రమణ, పెద్దిరెడ్డి అర్జున్ రావు, నమ్మి సత్య నారాయణ, అడపా చిట్టిబాబు పాల్గొన్నారు.

జనం కోసమే
www.suryaa.com
బాధితుల పక్షాన నిలిచి తక్షణ పరిష్కారం అందించుటయే లక్ష్యంగా... మెరుగైన అవినీతి రహిత సమాజం కోసం మీ అభిప్రాయాలే మా కథనాలు...
జాతీయ తెలుగు దినపత్రిక సూర్య కు పాఠకులే మార్గదర్శకులు, దిశా నిర్దేశకులు...
ప్రచురితమయ్యే ప్రతి కథనం ప్రజల పక్షమే
రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియజేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వినయంగా తెలియజేస్తున్నాం...
కొమ్మన సతీష్
బి.ఎ., బి.ఎల్.
ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో
ఫోన్: 9032209779
కొమ్మన దీపక్
బ్రాంచ్ మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్, యాడ్స్, సర్క్యులేషన్)
ఫోన్: 7095579999

# వర్షాకాలంలో భవన నిర్మాణరంగ అవసరాలకు ఇసుక నిల్వ



**– స్టాక్‌యార్డ్‌లో 13 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వచేయనున్నట్లు కలెక్టర్ వెల్లడి**

**అమలాపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ జిల్లాలో వర్షాకాలంలో భవన నిర్మాణ రంగ అవసరాలకు సుమారు 13 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ యార్డ్‌లో నిల్వలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లాస్థాయి విశ్వ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ మరియు కమిటీ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐదు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచులకు పర్యావరణ అనుమతులు రావడం జరిగిందని త్వరలో ఇసుక తవ్వకాల నిర్వహణ కొరకు టెండర్లు ఖరారు చేస్తూ ఈనెల 30 నాటికి ఇసుక తవ్వకాలు ప్రారంభించి స్టాక్ యార్డులకు ఇసుకను తరలించి నిల్వలు చేయడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లు ఆపరేషన్ కొరకు కనీసం ఐదు ప్రక్క జిల్లాల విధివిధానాలపై అధ్యయనం చేస్తూ ఈనెల 16 నాటికి కార్యాచరణ సిద్ధపరచాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌వారికి సూచించారు. ప్రస్తుతం పనిచేస్తున్న టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను బలోపేతం చేస్తూ అక్రమ ఇసుక త్రవ్వకాలు రవాణాను నిరోధించాలన్నారు. అదేవిధంగా సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు కమిటీలో సభ్యులుగా ఉన్న డ్వామా పిడి, ఆర్అండ్‌బి ఎస్.ఇ, జలవనరుల శాఖ ఇంజనీర్, జిల్లా రిజిస్టర్, జిల్లా ఆడిటర్లు సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు ఆపరేషన్స్‌పై విధివిధానాలపై నిష్పక్షపాతంగా విధానాలు ఉండేటట్లు రూపొందించాలన్నారు. ఈనెల 17న టెండర్లు పిలిచి ఈ నెల 22వ తేదీన ఫైనలైజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 16వ తేదీన సెమీ మెకనైజ్డ్ రీచుల కార్యకలాపాలపై మరొకసారి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి నిర్దిష్టమైన విధివిధానాలను కమిటీ సభ్యులు అనుమతితో ఖరారు చేయడం జరుగుతుందన్నారు. ఈ ఐదు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచులలో సుమారు 21 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. కొత్తపేట, రావులపాలెం, కపిలేశ్వరపురం, అమలాపురంలో స్టాక్ యార్డు లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత ఏడాది కేవలం వర్షాకాలం సీజన్లో 6.25 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వలు చేయడం జరిగిందని విస్తరిస్తున్న భవన నిర్మాణ రంగాన్ని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని దీనిని రెట్టింపు చేస్తూ 13 నుండి14 లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వలు ఉండే విధంగా కార్యాచరణ సిద్ధం చేయడం జరిగిందన్నారు. రావులపాలెం జాతీయ రహదారి–16కు దగ్గరగా 8 లక్షలు, అమలాపురం స్టాక్ యార్డ్‌లో 3 లక్షలు, తూర్పు డెల్టా గౌతమి ప్రాంతంలో 3 లక్షలు మెట్రిక్ టన్నులు నిల్వలు చేయనున్నట్లు తెలిపారు. ఈ స్టాక్ యార్డ్‌కు సంబంధించి యాక్సిస్ బులిటి రోడ్లు, పార్కింగ్ సౌకర్యాలపై వేయింగ్ బ్రిడ్జిలు వంటి వసతులపై అధ్యయనం చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. సెమీ మెకనైజ్డ్ రీచుల నిర్వహణ ఏజెన్సీలకు స్టాక్ యార్డ్ లలో ఇసుక తరలింపు కూడా అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉచిత ఇసుక పాలసీలో ఉన్న విధివిధానాల ప్రకారం స్టాక్ యార్డ్ లను బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు సుమారు 15 వేల మెట్రిక్ టన్నులు ఇసుక తవ్వకాలు నిర్వహించి స్టాక్ యార్డ్‌కు తరలించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం ఇసుక త్రవ్వకాలకు సంబంధించి మే, జూన్ మాసాలు మాత్రమే అనువుగా ఉంటాయన్నారు. స్టాక్ యార్డులు మరియు సెమీ మెకనైజ్డ్ రీచ్ లు మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఐదు సెమీ మెకనైజ్డ్ రీచులలో ఇసుక త్రవ్వకాలు పూర్తి స్థాయిలో చేపట్టిన అనంతరం ఒక సినీ మెకనైజ్డ్ రీచ్ ను కాకినాడ జిల్లా భవన నిర్మాణ అవసరాలకు కేటాయించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం స్టాక్ యార్డు లలో కేవలం 1,92,000 మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. కొన్ని మ్యానువల్ రీచ్ ల నుండి కూడా ఇసుకను స్టాక్ యార్డ్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డి పట్టా భూములలో ఇసుక తవ్వకాలు నిర్వహణకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు రావాల్సి ఉందని, ఇవి వచ్చిన పిదప సంబంధిత భూయజమాన్యాలు రోజువారీగా సుమారు 500 మెట్రిక్ టన్నుల ఇసుక త్రవ్వకాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉంటే వారికే ఇవ్వాలని లేని పక్షంలో మాన్యువల్ మాదిరిగా టెండర్లు పిలవాలని కమిటీ సభ్యులకు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు గుర్తించిన డి పట్టా భూములలో సుమారు 99,300 మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వలు ఉన్నాయన్నారు. స్టాక్ యార్డులలో ఇసుక నిలువలను వినియోగదారులకు సరఫరా చేసేందుకై ముందుగా అమలాపురం స్టాక్ యార్డ్ కు చార్జీలు నిర్ణయించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. డి పట్టా భూములలో ఇసుకను తరలించే మార్గాలలో బలహీనమైన వంతెనలు ఉన్నట్లయితే ఓవర్ లోడ్ తో వాహనాలు రాకపోకలు సాగించకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. ముఖ్యంగా అమలాపురం చుట్టుపక్కల బలహీన వంతెనలు గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఉచిత ఇసుక పాలసీ నిబంధనలకు అనుగుణంగా ఇసుక తరలించే వాహనాలు ఇసుకపై తప్పనిసరిగా తార్పాలిన్ కప్పి తరలించాలని ఆదేశించారు. అదేవిధంగా ఓవర్ లోడ్ విషయంలో రవాణా అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. బల్క్ వినియోగదారులు సాధారణ వినియోగదారుల కోపంలో జనరేషన్ విధివిధానాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, భూగర్భ గనుల శాఖ ఏడి ఎల్ వంశీధర్ రెడ్డి, గోదావరి హెడ్ వర్క్స్ ఈఈకాశీవిశ్వేశ్వరరావు, ఆర్టీవో డి.శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యుఎస్ డిఈ పద్మనాభం, జిఎస్‌డబ్ల్యుఎస్ కోఆర్డినేటర్ సువిజయ్, ఆర్అండ్‌బి ఎస్ఇ బి.రాము తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీవారి సదస్యం

– అంగరంగ వైభవంగా వెంకటేశ్వరుని కళ్యాణ మహోత్సవాలు





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి కళ్యాణోత్సవంలో భాగంగా నాలుగవ రోజు స్వామివారి సదస్యం కార్యక్రమం ఘనంగా జరిగింది. పండితులు ఖండవల్లి రాజేశ్వర వర ప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో మేలుకొలుపు, గౌతమీ నదీ తీరాన నుంచి తీర్థపు బిందె తీసుకొని వచ్చుట, నిత్యార్చన, నిత్య హోమములు, దిగ్ దేవతా బలిహారణ, ద్రవిడ వేదపారాయణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ, విశ్వక్సేన పూజ, అష్ట దిక్పాలక ఆరాధన, సదస్యం, శ్రీ స్వామివారికి చతుర్వేద పండితులచే వేదపారాయణ, మహదాశీర్వచనము, ప్రధాన హోమములు, దిగ్ దేవతా బలిహారణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ మొదలగు కార్యక్రమములు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాలను తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు పర్యవేక్షణలో వైభవంగా జరుగుతున్నాయి. గౌతమి నది వద్ద స్వామి వారి తెప్పోత్సవ పనులను పరిశీలించారు.

## ప్రతిభావంతుల పట్ల కారుణ్యం చూపాలి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రతిభావంతుల పట్ల ప్రతి ఒక్కరు కరుణచూపాలని ఎంపీడీవో వెంకట్ రామన్ అన్నారు. గురువారం పారా సంస్థ ఆధ్వర్యంలో లొల్ల భవిత కేంద్రంలో కేర్ గివెర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ను విభిన్న ప్రతిభావంతుల కోఆర్డినేటర్ బడుగు మహిమ రావు ఏర్పాటు చేశారు. ఈ ప్రతిభావంతుల పిల్లల తల్లితండ్రులకు వారి యొక్క పిల్లలను ఏ విధముగా వారి కాళ్ళ మీద వారు నిలబడేలా ఎలా తయారు చేయాలి, రోజువారి కాలకృత్యాలు వారంతట వారే చేసుకునేలా పిల్లలను ప్రోత్సహించాలి అనే విషయమై ఆయన వివరిస్తూ తల్లితండ్రులతో ప్రాక్టీస్ చేయించడం జరిగింది. అదేవిధంగా విభిన్న ప్రతిభావంతుల హక్కుల ఆక్టివిస్ట్ బడుగు సుబ్బాయమ్మ రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యి విభిన్న ప్రతిభావంతులకు ఉన్నటువంటి హక్కులు, సంక్షేమ పథకాల కొరకు అవగాహన కల్పించడం, దివ్యాంగుల పిల్లల విషయంలో సమస్యలను పరిశీలించి పై స్థాయి అధికారులకు ఈ సమస్యలను తెలియపరచడానికి తన వంతు బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## సమన్వయంతో పని చేయండి- ఎంపిడిఓ



**అల్లవరం, మేజర్ న్యూస్ :** స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావే శంలో ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ మాట్లాడుతూ నూతనంగా బదిలీపై వచ్చిన ఎపిఓ రాజామణి, ఇతర కార్యాలయ సిబ్బందిని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పరిచయం చేసి, సమన్వయంతో పని చేసి మండలంను అగ్రస్థానంలో నిలపాలని ఆదేశించారు.దాళ్వా వరి కోతల సమయంలో రైతులకు కూలీల కొరత లేకుండా స్థానిక వ్యవసాయ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్,ఎపిఓ రాజామణి,సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

# భూముల క్రమబద్ధీకరణ పథకం -2025 సద్వినియోగం చేసుకోండి



**అమలాపురం, మేజర్ న్యూస్ :** భూముల క్రమబద్ధీకరణ పథకం–2025 క్రింద గృహ మరియు నివాస యూనిట్ల అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను ఏడాది డిసెంబర్ 31 లోపుగా దరఖాస్తు చేసుకొని హక్కులు పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద సంఖ్యలో కుటుంబాలు ప్రభుత్వ భూములను అనధికారికంగా ఆక్రమించుకుని నివాస గృహాలు నిర్మిం చుకున్నారని, ఎలాంటి అధీకృత పత్రాలు లేకపోవడంతో వారు నిత్యం తొలగింపు బెదిరింపులకు గురవుతున్నారన్నారు ప్రజలు మరియు వారి ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్ళగా ఆక్రమణలు అభ్యంతర కరం కానందున, క్రమబద్ధీకరణ, ఒక వైపు ప్రజల కష్టాలను తొలగిస్తుందన్నారు మరోవైపు, సంబంధిత ప్రాంతాలు గ్రామ పంచాయితీ కూడా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని కలిగి ఉంటుందన్నారు. క్రమబద్ధీకరణకు సంబంధించిన ప్రాతినిధ్యాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, నివాసగృహాల ద్వారా అభ్యంతరం లేని ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి వివిధ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని నిశితంగా పరిశీలించిన తర్వాత, నివాస యూనిట్ల ద్వారా అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిపై అనధికారిక ఆక్రమణ స్థలాలు క్రమబద్ధీకరణ పథకం 2025ను జారీ చేసిందన్నారు. కావున అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూములలో గృహాలు, నివాస స్థలాలు కలిగినవారు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై
# నియోజక వర్గ రిటర్నింగ్ అధికారులు వ్యక్తిగత బాధ్యత వహించాలి

– జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఓటర్ల జాబితాల నాణ్యత ,స్వచ్ఛతను మెరుగుపరచడం కోసం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పై నియోజక వర్గ రిటర్నింగ్ అధికారులు వ్యక్తిగత బాధ్యత వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామ మూర్తి తెలియ చేశారు. గురువారం సాయంత్రం డి ఆర్వో ఛాంబర్‌లో అసెంబ్లీ నియోజక వర్గాల ఈ ఆర్వోలతో, ఇతర సిబ్బందితో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామ మూర్తి మాట్లాడుతూ, జిల్లా ఎన్నికల అధికారి నుంచి బూత్ లెవెల్ అధికారి వరకు ఓటరు జాబితా రూపకల్పనలో అధికారులందరూ పారదర్శకంగా పని చేయాలన్నారు . నియోజక వర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా మీపై గురుతరమైన బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఏదైనా ఉద్దేశపూర్వక ఉల్లంఘన జరిగితే, సంబంధిత అధికారిని జవాబుదారీగా చేయాల్సి ఉంటుందని కమిషన్ ఉద్బోధించిందన్న విషయాన్ని వివరించడం జరిగింది. క్లెయిమ్ నిబంధనల ప్రకారం మరియు అదే పేరు మరియు అదే ఇతిహాసం ప్రకారం పరిష్కరించాలన్నారు. ఓటరు నమోదు, తొలగింపు నేపధ్యంలో కమిషన్ మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని, తగిన ఆధారాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ బూత్‌ల హేతుబద్దత కలిగి ఉండేలా 800 నుండి 1200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ స్టేషన్‌ల సమీక్ష చేపట్టడం, ప్రతి ఓటర్ల నివాసం నుండి 2 కిలోమీటర్ల దూరంలో పోలింగ్ స్టేషన్‌ల ఉండేలా , వివరణాత్మక కసరత్తును చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నియోజక వర్గ ఎలెక్టోరల్ రిటర్నింగ్ అధికారులు పి. భాగ్య లక్ష్మి, ఎమ్ ఆర్ ఆర్ ప్రేమ్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనికి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

– జెడ్ రాగం పేటకు చెందిన బొడ్డు వెంకట శ్రీనివాస్ కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు 7 లక్షల 83 వేల 346 రూపాయలు చెక్కును అందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** స్థానిక రావులమ్మనగర్‌లోని టిడిపి కార్యాలయంలో పలువురికి సిఎం సహాయనిధి చెక్కులను అందజేసిన జగ్గంపేట శాసనసభ్యులు టిటిడి పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ. గండేపల్లి మండలం జడ్రాగంపేటకు చెందిన బొడ్డు వెంకట శ్రీనివాస్‌కు కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు 7,83,346 రూపాయలు చెక్కును కిర్లంపూడి మండలంతామరాడకు చెందినపంచాది కొండల రావుకు లక్ష రూపాయలు చెక్కును జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామానికి మద బోయిన వరలక్ష్మీకి108601, గిడి యాల రాజారావుకు 48000 చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే నెహ్రూ ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ, వైద్యానికి ఆర్థికస్తోమత లేని బాధితులు సాయంకోసం అర్థించగా ముఖ్యమంత్రికి సిఫార్సులు పంపించగా వారికి ముఖ్యమంత్రి సహాయనిధి సాయం మంజూరైంది అనిగురువారం ఆచెక్కులను అందజేశామన్నారు. ఆరోగ్యం దేశాభివృద్ధికి మూలమని, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి సాయం ఆశాజ్యోతి కావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కందుల చిట్టిబాబు, అనుకూల శ్రీకాంత్, కందుల కొండయ్య చౌదరి (బాబ్జి) ఉండవల్లి వరప్రసాద్, సుంకర సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాలిచ్చే గేదెలని అమ్మి.. నిలువునా మోసం

**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :**లీటర్లకొద్దీ పాలిస్తాయి.. రూ. లక్షల ఖరీదన్నారు.. ఏం మతలబు చేశారో తెలి యదు. ఆరులీటర్ల పాలిచ్చిన గేదె తీసుకెళ్లిన తర్వాత రెండు లీటర్లే ఇస్తుండడంతో నిలువునా మోసపోయామని లబోదిబోమంటున్నారు. బాధి తులు తెలిపిన వివరాలివీ.. తిరుపతి జిల్లా నాయు డుపేటకు చెందిన నారపల్లి లతకు భర్త ఇద్దరు కుమార్తెలు. ఇంటి వద్దనే ఉంటూ డెయిరీఫామ్ ఏర్పాటుచేసి ఉపాధి పొందాలన ుకున్నారు. నాణ్య మైన పాలిచ్చే గేదెల కోసం సోషల్మీడియా యూట్యూబ్లో వెతికారు. కొన్నిరోజుల కిందట కాకి నాడ జిల్లా జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో 'చంద్రశేఖర్ డెయిరీ ఫామ్' పేరుతో యూట్యూబ్లో ఒక వీడియో చూసి నిర్వాహకులు సుంకర చంద్రశేఖర్ చరవాణిలో మాట్లాడారు. రోజుకు 8 లీటర్ల పాలిస్తాయని మంచి బలిష్టమైన గేదెలను చూపించి ధర రూ.70 వేలు నుంచి రూ. లక్ష వరకు ఉంటుం దని చెప్పారు. అతని మాటలు నమ్మి మార్చి 10న తండ్రితో కలసి గేదెలను చూసేందుకు లత వచ్చారు. ఒక గేదెను చూపించి ఎదురుగా 6 లీటర్ల పాలుపిండి మిగిలిన గేదెలు ఇలాగే ఇస్తాయని నమ్మబలికారు. ఒక్కో గేదె ధర రూ.1.30 లక్షలుగా బేరం కుదిర్చి ఆరు గేదెలకు ఇతర ఖర్చులతో కలిపి రూ.8 లక్షలు బేరం కుదిర్చారు. రూ.2 లక్షలు నగ దు రూపంలోనూ మిగిలిన సొమ్ములు ఫోన్పే ద్వారా చెల్లించారు. ఒకరోజు తర్వాత గేదెలను లారీలో పంపించారు. పాలుతీసేందుకు గేదెల వద్దకు వెళ్లగా ఒక లీటరు పాలు మాత్రమే ఇవ్వడంతో మోసపోయామని గమనించారు. దీంతో సదరు వ్యాపారస్తుడికి ఫోన్చేసి చెప్పగా మేము ఇచ్చిన గేదెలు మంచివేనని తిట్టి ఫోన్ పెట్టేశారు. దీంతో మోసపోయిన మేము గేదెలను లారీలో కాట్రావులపల్లి తీసుకొచ్చాం. పెద్దల సమక్షంలో రూ. 7లక్షల 10వేలు తిరిగి ఇచ్చేందుకు అంగీకరించారు. మొత్తం డబ్బులు ఏప్రిల్ 1కి ఇస్తామని చెప్పి ఏప్రిల్ 5న రూ.4 లక్షలు ఇచ్చారు.





మిగిలిన సొమ్ముల కోసం అడిగితే వాయిదాలు వేస్తున్నారని బాధితు రాలు వాపోయింది. గేదెలను కొనుగోలు చేసి నిలువునా మోసపోయానని 500 కి.మీ. పైబడి ఇక్క డకు వస్తే వాయిదాలు వేస్తూ ఇబ్బందులు పెడుతు న్నారని తనకు న్యాయం చేయాలని బాధితురాలు లత వాపోతున్నారు. ఈ విషయంపై ఎస్సై రఘు కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలి



**ఆలమూరు, మేజర్ న్యూస్ :** ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలని ఆలమూరు విద్యుత్ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని జొన్నాడ గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటిస్తూ విద్యుత్ లైన్లను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా సోలార్ రూఫ్ టాప్స్ ఏర్పాటు చేసుకున్న వారికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. గృహ వినియోగదారులు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని తెలిపారు. అలాగే గృహ విద్యుత్ వినియోగంలో అదనపు లోడ్ను క్రమబద్ధీకరం చుకోవాలని ఆయన తెలిపారు. గృహ వినియోగానికి సంబంధించి చాలా వరకు మొదట ఒక కిలో వాట్ లోడ్తోనే కనెక్షన్ తీసుకుంటారని, అయితే ఆ తర్వాత ఏసీలు, ఇతరత్రా వాటితో లోడు రెండు, మూడు కిలో వాట్ల్కు పెరుగుతుందన్నారు. వినియోగించిన విద్యుత్కు వినియోగదారులు చార్జీలు చెల్లిస్తున్నప్పటికీ ట్రాన్స్ఫార్మర్పై లోడు పెరుగుతుండటం వల్ల కాలిపోవడం, లో ఓల్టేజీ, హైవోల్టేజీ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అదనపు లోడ్ను క్రమబద్ధీకరించుకుంటే ట్రాన్స్ఫార్మర్ సామర్థ్యంపై పూర్తి స్పష్టత వస్తుందన్నారు. అదనపు లోడు క్రమబద్ధీకరణకు డిపాజిట్మొంటుకు చెల్లించాల్సిన రుసుములో 50 శాతం రాయితీతో ఏపీఈపీడీసీఎల్ వెబ్సైట్ %ఒఒఒ.ఞజూూజూ.ఎఠీ.శీఅ%, సమీపంలోని మీ సేవ, గ్రామ, వార్డు సచివాలయాల్లో చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశం ఏప్రియల్ 30 వరకు ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# విద్యుత్ సరఫరా అంతరాయం



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు సబ్ స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 11వ తేదీ శుక్రవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు 33/11 కె.వి కానూరు విద్యుత్ సబ్ స్టేషన్ నందు మరమత్తులు నిమిత్తం కానూరు, నడుపల్లి ,ఉసులుమర్రు,కానూరు అగ్రహారం మరియు తీపర్రు గ్రామములకు సంబంధించి గృహ మరియు వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును. వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 7:00 గంటల నుండి 10:00 గంటల మరియు మధ్యాహ్నం 12:00 గంటల నుండి సాయంకాల 06:00 గంటల వరకు సరఫరా చేయబడును.కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా ఎం నారాయణ అప్పారావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్స్ ఏపీ ఈపీడీసీఎల్ వారు కోరారు.

# సర్వేయర్ల ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా పిఠాపురం మండలం పరిధిలోగల సచివాలయాల సర్వేయర్లు అందరూ కలిసి పిఠాపురం మండలం కుమారపురం గ్రామంలో గల సచివాలయం వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జాతీయ సర్వే దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు పిఠాపురం సామర్లకోట ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనదారులకు చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం మండల పరిధిలో గల సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.

# శివారు ప్రాంతాల ప్రజలకు నీటి ఎద్దడి నివారించాలి



కాకినాడ, మేజర్ న్యూస్ : తాగునీటి కుళాయిలకు అక్రమంగా మోటార్లు బిగించి కృతిమ నీటి కొరత సృష్టిస్తున్న గృహాల పైపులైన్లను కట్ చేసి ఆవాసాల్లో శివారు ప్రాంతాల ప్రజలకు నీటి ఎద్దడి నివారించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు.
గురువారం మద్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ యండిఓలు, డ్వామా ఎపిఓ లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి జాతీయ ఉపాధి హామీ పనుల లక్ష్యసాధన, వేసవి కార్యాచరణ ప్రణాళిక, 0–6 సంవత్సరాల చిన్నారుల ఆధార్ నమోదుకు క్యాంపుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో ప్రజలకు ఎటువంటి త్రాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా జిల్లాలోని ప్రతి ఆవాసంలో కనీసం ఒక త్రాగునీటి సోర్స్ ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఎండిఓలను ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో గృహ టాప్ కనెక్షన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడుకోవడం వల్ల హై లెవల్ ప్రాంతాలు, పైపులైన్ల చివరి ప్రాంతాల ప్రజలకు నీటి సమస్య ఎదురౌతున్న అంశం తన దృష్టికి వచ్చిందన్నారు. అక్విడక్ట్ నిర్మాణ పనుల కారణంగా పంపా రిజర్వాయర్ కు ఏలేరు నీటి విడుదల లేదని, ఈ నేపద్యంలో అన్నవరం దేవస్థానం, అన్నవరం గ్రామానికి ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లను సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు.
లక్ష్యసాధనలో ఉత్తమ ఫలితాలు సాధించిన అధికారులకు ప్రశంసలు
జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో 2024–25 సంవత్సరానికి వివిధ సూచికల క్రింద లక్ష్యసాధనలో ఉత్తమ కృషిచేసిన మండలాల యండిఓలను, ఎపిఓలను జిల్లా కలెక్టర్ గురువారం నిర్వహించిన సమావేశంలో అభినంది చారు. అన్ని సూచికల సాధనలో మొదటి స్థానంలో పిఠాపురం, రెండవ స్థానంలో గండేపల్లి, మూడవ స్థానంలో కాకినాడ రూరల్, నాల్గవ స్థానంలో ఏలేశ్వరం మండలం నిలువగా ఆ మండలాల యంపిడిఓలు, ఎపిఓలను కలెక్టర్ మెమెంటోలతో సత్కరించారు.జిల్లాలో 2024–25 సంవత్సరానికి ఉపాది హామీ పనులద్వారా 78 లక్షల పనిదినాలు కల్పించే లక్ష్యం నిర్ధేశించుకోగా, 75 లక్షలు పనిదినాలు కల్పించి 96 శాతం లక్ష్యాన్ని సాధించడం జరిగిందని, గత ఏడాది కంటే 6 లక్షల పనిదినాలు అదనంగా కల్పించడం ముదావహ మన్నారు. ఇదే స్పూర్తితే ఈ సంవత్సరం మరింత మెరుగైన లక్ష్యాలను అందుకోవాలని కోరారు. పనిదినాల కల్పనలో ఏలేశ్వరం, గండేపల్లి, కిర్లంపూడి, జగ్గంపేట, యు.కొత్తపల్లి ముందు నిలిచాయని ప్రశంసిస్తూ, తుని, కరప, కోటనందురు, పెదపూడి మండలాలు లక్ష్యసాదనకు మరింత కృషి చేయాలని సూచించారు. వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు 461 నీటి తొట్టెల నిర్మాణ లక్ష్యం చేపట్టగా ఇప్పటి వరకూ 246 పనులు మంజూరు చేసి 78 పనులు పూర్తి చేసారన్నారు. మిగిలిన నిర్మాణాలను కూడా త్వరితగతిన నిర్వహించి పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో చేపట్టిన 0–6 చిన్నారుల ఆధార్ నమోదు కొరకు ఫోస్టాఫీస్, సిఎస్సి, సచివాలయాలతో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు షెడ్యూల్ తెలియజేస్తామని, ఈ ప్రక్రియపై అన్ని ఆవాసాల్లో టాంటాం ద్వారా ప్రజలందరికి తెలియజేయాలని యండిఓలను ఆదేశించారు. యండిఓలు, సిడిపిఓలు సమన్వయంతో చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో డ్వామా పిడి పి. వెంకటలక్ష్మి, ఎండిఓలు, ఎపిఓలు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలని అన్నదానం





కాకినాడ, మేజర్ న్యూస్ : క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా తూరంగి మాజీ ఎంపిటిసి పితాని వెంకట రాము సుమారు 600 మందికి అన్నదానం అందజేశారు. గురువారం స్థానిక కులాయి చెరువు అన్నా కేంటీన్‌లో ఈ అన్నదానం చేపట్టానని, మానవతా దృక్పథంతో సమ సమాజ భావన కలిగి తన వంతు సమాజానికి కొద్దిపాటి మేలైన చెయ్యాలనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియాతో పితాని వెంకట రాము మాట్లాడుతూ ఇటీవల అకాల మరణం పొందిన క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ పగడాల మృతి చాలా బాధాకరమని అయన మృతి క్రైస్తవ సంఘాలకు తీరని లోటన్నారు. ఆయనపై గౌరవంతో ప్రవీణ్ పగడాల స్మృతికి ఈ అన్నదానం చేపట్టడం జరిగిందన్నారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతిని ప్రసాదించి, ఆ కుటుంబానికి మనోధైర్యం కలుగజేయాలని ఈ సందర్భంగా పితాని వెంకట రాము తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రచారంలో మజ్జిగ పంపిణి



చింతూరు,మేజర్‌న్యూస్ : స్థానిక చింతూరు ఐటిడిఏ ప్రాంగణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ అధ్యాపకులు, మన్యం కవి నూనె రమేష్ ఏర్పాటు చేసిన చలివేం ద్రంలో పర్యావరణ పరిరక్షణకు తీసుకోవల్సిన చర్యలను నూనె రమేష్ వివరిస్తూ ఐటిడిఏ కి విచ్చేసిన వివిధ మండలాల ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణి చేస్తూ వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ హితం కొరకు ప్లాస్టిక్ నిర్మూలన చెయ్యాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ పర్యావరణానికి సమాజానికి కలుగ జేచేస్తున్న ప్రమాదాలను వివరిస్తూ ప్లాస్టిక్ పెనుభూతంగా తయ్యారయ్యింది అన్నారు. ప్లాస్టిక్ పర్యావరణ కాలుష్యం, సముద్ర జీవులకు హాని పశువులకు ముప్పు, ఆరోగ్య సమస్యలు, వ్యర్థ నిర్వహణ సమస్య, భూమి ఉర్వరత తగ్గింపు వంటి ఇబ్బందులను కలిగిస్తుందన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా జూట్, కాగితం, ఇలాంటివి వాడాలి అని అన్నారు. పునర్వినియోగ చేయగల ప్లాస్టిక్ మాత్రమే ఉపయోగించి, ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేదించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు కట్టా శైలజ, గూడెం హారతి, విద్యార్థులు వేముల చిరంజీవి, గణేష్, మురళి దుర్గ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# రావులపాలెం జిల్లా మాల మహానాడు జేఏసీ సమావేశం



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎస్.సి వర్గీకరణకు అనుకూలంగా వేసిన వన్ మ్యాన్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా సిఫారసులను మంత్రి మండలి, అసెంబ్లీ ఆమోదం తెలపడాన్ని వ్యతిరేకిస్తూ మాల మహానాడు జేఏసీ ఆధ్వర్యంలో గురువారం అంబెడ్కర్ కోనసీమ జిల్లా మాలమహానాడు జాయింట్ యాక్షన్ కమిటీ రావులపాలెంలో సమావేశామయ్యారు. రావులపాలెం ఆదిలక్ష్మి పుంత కొత్త కాలనీ రోడ్‌లో ఒక గెస్ట్ హౌస్‌లో కప్పల శ్రీధర్ అధ్యక్షతన జెఏసి నాయకులు డి.బి.లోక్, ఇసుకపట్ల రఘబాబు, గొల్లపల్లి డేవిడ్‌రాజు, జంగ బాబురావు, నెల్లి లక్ష్మీపతి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, రాజ్యాధికారం దిశగా కొనసాగుతున్న ఎస్సీలను అణగదొక్కాలనే ఉద్దేశంతో మంద కృష్ణా చంద్రబాబు, నరేంద్ర మోడీ కాళ్ళు పట్టుకుని వర్గీకరణకు అనుకూలంగా మలచుకుని, పార్లమెంట్ ద్వారా అవ్వవలసిన బిల్లు ను కోర్ట్ తీర్పు ద్వారా విడదీసారని, తీర్పు వచ్చిన మరునాడే ఇటు బాబు, అటు రేవంత్ రెడ్డి లు అమలు చేసేస్తామని శాస్త్రీయతను వదిలి మాట్లాడుతున్నారన్నారు. 2011లో ఉమ్మడి రాష్ట్రములో తీసిన జనాభా లెక్కలతో అప్పుడు కులాల వారీగా లెక్కలు తీయ్యలేదు, కులగణన ఆధారంగా 14 ఏళ్ళ తరువాత 10 ఏళ్ళ క్రితం ఏర్పడ్డ రాష్ట్రంలో ఆ లెక్కల ప్రకారం ఎవడు ఎలా పోతే నాకేంటి అనే ధోరణిలో తాంబూలాలు ఇచ్చాము తన్నుకు చావండి అని చెప్పడమేనా అంటు ప్రశ్నించారు. 3లక్షల 16 వేల కోట్ల బడ్జెట్‌లో 20 వేల కోట్లు ఎస్సీలకు కేటాయించావు అది సమన్యాయమా అని, అందులో 50 వేల కోట్లు సబ్ ప్లాన్ నిధులు రావాలి కదా మరి అవి ఇవ్వకుండా సమన్యాయం ఎలా చేస్తావు బాబు అంటు ఎద్దేవా చేసారు. గత ఏడాదిలో ఎస్సీ లకు కేటాయించిన 18 వేల కోట్లు ఏమి చేసావు బాబు అని ప్రశ్నంచారు. వాటిని జనాభా ప్రాతిపదికన ప్రతి కుటుంబానికి పంచకుండా మాట్లాడడం మీకే చెల్లిందన్నారు.మాదిగలకు ఎక్కడ అన్యాయం జరిగిన ఉద్యమించింది మాలలే అని, దేశం మొత్తంలో ఎస్సీ ఎస్టీ చట్టం తెచ్చింది మాలల పోరాటం పలితమే అని గ్రహించండి, మంద కృష్ణా పబ్బం గడుపుకోవాలని చూడడం తప్పా, ఇది ఆచరణలో సాధ్యం కాదు అనేది తెలుసుకోండి అని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో కొనాల రాజు, గాడి క్రిష్టాఫర్, కుసుమే ప్రవీణ్, కుష్మి రాంబాబు, ఎడ్ల రాయుడు, వీర్రాజు, దావీదు, ఉంద్రు నాగరాజు, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద మజ్జిగ పంపిణీ



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, కాండ్రకోట గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ నూకాలమ్మ అమ్మ వారి దేవస్థానం వద్ద జాతర సందర్భంగా విచ్చేసిన భక్తులకు గురువారం కాండ్రకోట గ్రామంలో గల గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చిరంజీవి మరియు వారి సిబ్బంది, శ్రీ గీతా శివభక్తుల సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, భక్తులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీకోదండ రాముని సన్నిధిలో భారీ అన్న సమారాధన – 2000 మందికి అన్నదానం



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రాజవొమ్మంగి కమ్మరి పేటలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ కోదండ రామాలయం ఆవరణలో గురువారం భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి, మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో స్థానిక హోమ్ నీడ్స్ వ్యాపారి మల్లి రెడ్డి ఎంటర్ప్రైజెస్ గోవిందు తన తండ్రి సత్యనారాయణ పేరు మీద 2000 మందికి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు , బి వి ఎస్ ఎన్ గుప్తా, పోస్టల్ బాబుతదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ హెచ్ఐవి మరియు ఎయిడ్స్ అవగాహన దినోత్సవం



కాకినాడ, మేజర్‌న్యూస్: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవాపథకం, కాకి నాడ ఐడిఎ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జాతీ య యువ హెచ్ఐవి మరియు ఎయిడ్స్ అవగాహన దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలియ జేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ వ్యవస్థాపకులు మరియు కాకినాడ ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ యువతలో హెచ్ఐవి నివారణ, పరీక్ష మరియు చికిత్సలో కొనసాగుతున్న ప్రయత్నాల గురించి అవగాహన పెంచడానికి ఈ రోజు ఉపయోగపడుతుందని అన్నారు. యువత హెచ్ఐవి మరియు ఇతర లైంగికంగా సంక్రమించే ఇన్ఫెక్షన్లను నివారించడానికి అవగాహన కలిగి ఉండేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా హెచ్ఐవి ప్రాబల్యాన్ని ఆపడానికి దేశం ఇప్పటికే పురోగతిని సాధించిందని, హెచ్ఐవి మరియు ఎయిడ్స్ రహిత భారత్ మన లక్ష్యమని అన్నారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ మన దేశంలో ఇప్పటికీ 15 నుండి 49 సంవత్సరాల మధ్య వయస్సు గల 2.5 మిలియన్ల మంది హెచ్ఐవి/ఎయిడ్స్‌తో జీవిస్తున్నారని "ఎయిడ్స్ రహిత భారత˘దేశం" కోసం అవగాహన పెంచడం ద్వారా హెచ్ఐవి సంక్రమ ణను పూర్తిగా నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్ర మంలో ఐ డి ఏ సభ్యులు డాక్టర్ ఏరోష, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తేజేశ్వరరావు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈనెల 24న పవన్ ఇంటి వద్ద సామూహిక రాయబార కార్యక్రమం



**– భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఏప్రిల్ 24న చేపట్టబోయే డిప్యూటీ సీఎం పవన్ ఇంటి వద్ద సామూహిక రాయబార కార్యక్రమం కరపత్రాన్ని గురువారం పట్టణంలోని స్థానిక సందూరి ప్రసాద్ రావు వద్ద ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు జిల్లా గౌరవ అధ్యక్షులు కరణం విశ్వనాథంలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత వైసిపి ప్రభుత్వం నిర్మాణ రంగ కార్మికులకు అన్యాయం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డ్ ను పునరుద్ధరిస్తామని ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ క్లెయిమ్ విడుదల చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, సెస్ నిధులను కార్మిక సంక్షేమానికి ఉపయోగించాలని, వివిధ సందర్భాల్లో గత ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు నుంచి తీసుకున్న నిధులను జమ చేయాలని, అర్హులైన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా ఇంటి లోను మంజూరు చేయాలని, కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్ ఇవ్వాలని, పనుల కోసం వేచి ఉండే అడ్డాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేయాలని, నిర్మాణాల్లో ఉపయోగించే ముడిసరుకుల ధరలు తగ్గించాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఈ 24 వ తారీఖున డిప్యూటీ సీఎం పవన్ ఇంటిదగ్గర చేపట్టబోయే రాయబార కార్యక్రమంలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కరపత్రాన్ని ఆవిష్కరించిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పప్పుల వీరబాబు,ఎం సత్తిబాబు,ఎం సూరిబాబు,జి. సత్తిరెడ్డి, ఉమ్మి గోవిందు, డి. గోపాలకృష్ణ, పి.కృప తదితరులు ఉన్నారు.

# అధికారం లేకున్నా ఆదరణ ఉన్న నాయకుడు జగన్ మోహన్ రెడ్డి



**– మాజీ ముఖ్యమంత్రికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే**

**– పిఠాపురం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి వంగా గీత విశ్వనాథ్**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజాదరణ ఉన్న నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని, ఒక మాజీ ముఖ్యమంత్రికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పిఠాపురం నియోజకవర్గ వైయస్సార్సీపి ఇంచార్జ్ వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, అందు కారణం ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలేనని తెలిపారు. గత వరదల సమయంలో పిఠాపురం వచ్చినప్పుడు కూడా హెలీపాడ్ వద్దకు అశేష జనవాహిని రావడం జరిగిందని, రాప్తాడు వెళ్ళినప్పుడు కూడా హెలికాప్టర్ వద్దకు వేలాదిగా ప్రజలు రావడం జరిగిందన్నారు. కొంతమంది ఆయన ఎమ్మెల్యే ఎమ్మెల్యే అంటూ మాట్లాడుతున్నారని, ఒకరి విలువని ఎవరో తగ్గిస్తే తగ్గేది కాదన్నారు. జరిగిన ఘటనపై ప్రభుత్వం బాధ్యత వహించాలని, అత్యంత ప్రజాదరణ కలిగిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సరైన భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

# పవన్‌కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని తుమ్మలపల్లి రమేష్ ప్రత్యేక పూజలు



**కిర్లంపూడి, మేజర్ న్యూస్ :** రామచంద్రపురం గ్రామంలో తుమ్మలపల్లి రమేష్ మరియు తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని హోమం నిర్వహించారు.సింగపూర్ లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో అక్కడ చదువుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి చిన్న కుమారుడు మార్క్ శంకర్ కు గాయాలైన విషయం చాలా బాధాకరం. సింగపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని మొన్న పెద్దాపురం మైదమ్మా తల్లిని, నిన్న కాండ్రకోట శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ వారిని దర్శించి ప్రత్యేకమైన పూజలు నిర్వాహించి, ఈరోజు తుమ్మలపల్లి రమేష్ గారు స్వగ్రామమైన రామచంద్రపురం గ్రామంలో రాజరాజేశ్వరీ సమేత చంద్రమౌలేశ్వర స్వామి ఆలయంలో జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ మరియు రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి శేఖర్ శ్రీ లక్ష్మీ గణపతి, చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ కి అగ్నిప్రమాదంలో గాయాలడం చాలా బాధాకరమైన విషయం అని, మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని గత మూడు రోజుల నుంచి పలు ఆలయాలు సందర్శించి పవన్ కళ్యాణ్ గారి కుమారుడు మార్క్ శంకర్, జనకుల గోత్రంతో అర్చన చేయించి,ఈ రోజు రామచంద్రపురం గ్రామంలో హోమాలు నిర్వహించామని, మార్క్ శంకర్ త్వరలోనే కోలుకుంటారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణ శేఖర్, మాదారపు వీరబాబు,కాయల మణికంఠ,వెంకన్న, ధత్త, అడబాల వీరబాబు, శ్రీను,రాజు ఇతరులు పాల్గొన్నారు.

# ఎంపిడిఓను అభినందించిన సర్పంచ్



**అల్లవరం,మేజర్‌న్యూస్ :** అల్లవరం మండలం వర్క్ ఫ్రం హోం సర్వేలో జిల్లాలో 100 శాతం సాధించిన మండలంగా నిలిచిన సందర్భంగా ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్‌ను బోడసకుర్రు సచివాలయంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. మండలాన్ని అన్ని సర్వేలు, కార్యక్రమాలలో ముందు వరుసలో ఉంచుతున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, రొక్కాల నాగేశ్వరరావు, కార్యదర్శి బి.ఆది శంకరం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మహావీర్ జయంతి కార్యక్రమం



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** మహావీర్ జయంతి సందర్భంగా గురువారం జైన్ బ్యాంకర్స్ & మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జైన్ దేవాలయం నందు నిర్వహించిన మహావీర్ జయంతి కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు పాల్గొని మహావీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ జైన మతస్థుల ఆరాధ్య దైవం అహింస, సత్యం తదితర పంచ సూత్రాలను ప్రబోధించిన ధర్మ ప్రచారకర్త మహావీర అని, మానవాళికి శాంతి, అహింసలతో కూడిన గొప్ప సందేశాన్ని అందించిన మహావీరుని స్ఫూర్తిగా మనందరం శాంతియుత సమాజ స్థాపనకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భవర్ లాల్ జైన్, అమన్ జైన్, విక్రమ్ జైన్, తిలోక్ చంద్ జైన్, అంబాలాల్ తదితరులు పాల్గొన్నారు.


## వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి


**– పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ అన్నారు. పిఠాపురం మరియు గొల్లప్రోలు సరిహద్దు టోల్ ప్లాజా వద్ద పిఠాపురం పిఠాపురం సర్కిల్ ఎస్సైలు వి. మణికుమార్, ఎన్. రామకృష్ణ మరియు సిబ్బందితో కలిసి హైవే వెళు న్న ద్విచక్ర వాహనదారులకు వాహనాలను నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించవలసినటువంటి ట్రాఫిక్ రూల్స్, దగ్గర ఉండవలసిన డాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్సులు, ఇన్సూరెన్సు గురించి మరియు ప్రస్తుత చట్టాలపైన అందరికీ అవగాహన సదస్సు నిర్వహించారు. వారందరికి అధిక వేగంగాను/మద్యం సేవించి/ మొబైల్ డ్రైవింగ్ చేసేటప్పుడు జరిగే అనర్థాలు గురించి వివరిస్తూ యాక్సిడెంట్ లో పొరపాటున వాహనం నడిపే వ్యక్తి అని లేదా ఎదుటి వ్యక్తి గాని నష్టం జరిగిన లేదా ప్రాణాలు పోయిన వారితోపాటు వారి యొక్క కుటుంబ సభ్యుల జీవితాల్లో కూడా ఆర్థికంగానూ మానసికంగాను ఇబ్బందులు కలుగుతాయి కనుక వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించి ఎటువంటి ప్రమాదాలకు గురికావద్దని తెలియజేశారు.

# పంచాయతీ అధికారులకు అభినందనలు





అన్ని అనుమతులతో ప్రొసీడింగ్స్ జారీ చేసిన అధికారులు

**- ఆలమూరు వినాయక కన్వెన్షన్ యాజమాన్యంచే రూ.26,60,460లు కట్టించారు**

**- ప్లాను ప్రకారం కట్టడాలు**

**ఆలమూరు,మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం ఆలమూరు గ్రామపంచాయతీ పరిధిలో వినాయక కన్వెన్షన్ పేరుతో ఎకరం విస్తీర్ణంలో అతిపెద్ద ఫంక్షన్ హాల్ నిర్మాణంలో అక్రమాలపై సూర్యకథనాలతో కదిలిన పంచాయతీ అధికారులు...రెండు నోటీసులు జారీ చేసి సదరు యజమానితో రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీకిఅక్షరాల రూ.26 లక్షల60వేల460 రూపాయలు రెండు విడతలుగా చెల్లించేలా వ్యవహరించారు. నిర్మాణానికి తగ్గ అనుమతులను పాత ప్లాన్‌కు మోడిఫికేషన్ చేసి నిర్మాణాలకు తగినట్లుగా కొత్తగా ప్లాన్‌ను రుడా అధికారుల నుంచి వినాయక కన్వెన్షన్ హాల్ యాజమాన్యం పొందారు. సూర్యకథనంతో ప్రభుత్వ ఖజానాకి 26 లక్షల 60వేల 460రూపాయలు జమకాబడ్డాయి.లక్ష్యంలో విజయం సాధించిన జిల్లా పంచాయతీ అధికారిని శాంతాలక్ష్మి, డిఎల్‌పిఓ రాజులను ప్రజలు అభినందించారు.

# ప్రజా సమస్యల స్పందనక్కై సిపిఐ ప్రచార జాత ప్రారంభం

**- పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిత్యవసర ధరలను తగ్గించాలి**

**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సామర్లకోట విగ్నేశ్వర టాకీస్ వీధిలో పట్టణ సిపిఐ ఆధ్వర్యంలో జిల్లాకార్యవర్గ సభ్యులు పెద్ది రెడ్ల సత్యనారాయణ అధ్యక్షతన గురువారం ఉదయం ప్రజా సమస్యల స్పందనక్కై సిపిఐ ప్రచార జాతను ప్రారంభించడం జరిగింది. ఈ జాతకు ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. కామిరెడ్డి బోడకొండ ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ల చరిత్ర గల పార్టీ అని, ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసిన ఘనమైన చరిత్ర పార్టీకి కలదని, భూ పోరాటాలు, దున్నేవాడికి భూమి, గ్రామీణ ఉపాధి హామీ పథకాలు, బ్యాంకులు జాతీయకరణం తదితర అనేక రకాల ఉద్యమాలు చేసింది భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆయన అన్నారు. అర్హులైన పేద ప్రజలందరికీ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు భూమిని, అర్బన్ ప్రాంతాల్లో రెండు సెంట్లు భూమిని ప్రభుత్వం కేటాయించి 5 లక్షల రూపాయల ఇల్లు నిర్మాణం కొరకు లోన్లు కేటాయించాలని ఆయన అన్నారు. ప్రజ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని కాకినాడ జిల్లా అంతా ఈ ప్రచార జాత జరుగుతుందని, ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రజాప్రతి నిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఉద్యమాలు చేపడుతామని ఆయన అన్నారు. తోకల ప్రసాద్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానంలో భాగంగా ఉచిత గ్యాస్ పంపిణీ పథకం అమలు చేస్తూనే మరోపక్క దొడ్డి దారిన నడ్డి విరిచే చందంగా గ్యాస్ పై ?50 అదనంగా పెంచి సామాన్య ప్రజలపైనిలువు దోపిడీ




చేస్తున్నారని, పెట్రోల్, డీజిల్ నిత్యవసర అధిక ధరలు వెంటనే నియంత్రించాలని, సామాన్య ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని, రైతులకు ఉచిత విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలలో చదువుతున్న విద్యార్థుల ఫీజు బారాలు తగ్గించాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని, నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, డీఎస్సీ త్వరగా అమలు అమలు చేసి పెండింగ్లో ఉన్న టీచర్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని, స్కూల్ తెరిచే సమయానికి తల్లికి వందనం పథకం అమలు చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పున ప్రారంభించాలని తదితర డిమాండ్ల సాధనకై ఈసిపిఐ ప్రచార జాత జరుగుతున్నదనిఈప్రసారజాతలో సిపిఐజిల్లానాయకులు కేశవరపు అప్పలరాజు,జిల్లాకార్యవర్గసభ్యులు సూరిబాబు, మడగల రమణ, పెద్దిరెడ్డి అర్జున్‌రావు,నమ్మి సత్యనారాయణ ,అడపా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి

**- వద్దిపర్రు గ్రామంలో నూతన రోడ్డు పనులకు శ్రీకారం**


**- పాల్గొన్న బందారు సత్యానందరావు**

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానారాయణ అన్నారు. వద్దిపర్రు గ్రామంలో సర్పంచ్ జోజవరపు శ్యామల హరిబాబు ఆధ్వర్యంలో అమలాపురం బొబ్బర్లంక ప్రధాన రహదారి నుండి రజకులపేటకు వయా ఏటిగట్టు మీదుగా ఎంపీ లాడ్స్ నుంచి 50 లక్షల రూపాయల అంచనాలతో వేయనున్న నూతన తారురోడ్డుకు అలాగే గోదావరి గట్టు నుంచి ఎస్సీ కాలనీ మీదుగా వద్దిపర్రు పంచాయితీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని అభివృద్ధి పరుచుటకు ఎంపీ లాడ్స్ 50 లక్షల రూపాయలతో నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయకుండా గత ప్రభుత్వం విస్మరించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. నాటి రోడ్లకు నేటి రోడ్లకు బేరీజు వేసుకోవచ్చు అన్నారు. మండలంలోని వెలిచేరు నుండి బొబ్బర్లంక వరకు రోడ్డు అభివృద్ధి చేసేందుకు 36 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామన్నారు.



త్వరలో నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే వెలిచేరు ఊదలమ్మ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, జిల్లా ప్రాజెక్ట్ కమిటీఉపాధ్యక్షులు కరుటూరి నరసింహ రావు, మాజీ ఎంపీపీ పి.ఎస్. రాజు,లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, ఆర్‌అండ్‌బి డిఈ రాజేందర్, ఏఈ మణికుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శృంగార వల్లభ స్వామి దేవస్థానం వద్ద సామూహిక కుంకుమార్చనలు - పాల్గొన్న భక్తులు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తొలి తిరుపతిలో శ్రీ శృంగార వల్లభ స్వామి కళ్యాణ ఉత్సవాలలో భాగంగా గురువారం దేవస్థాన కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తిల పర్యవేక్షణలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమా చార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ భూ అమ్మ వార్లకు ఉచిత సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500మందికిపైగా ముత్తైదువులు పాల్గొన్నారు. దేవస్థాన ఆధ్వర్యంలో పూజకు అవసరమైన పూజా సామాగ్రిని భక్తులకు ఉచితంగా అందజేశారు. అనంతరం దేవస్థానం ఏర్పాటు చేసిన అన్నప్రసాదంలో భక్తులు పాల్గొన్నారు.

## ఎపిజిఎల్ఏ పెద్దాపురం సమితి నూతన కార్యవర్గం ఎన్నిక



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండల పరిషత్ సమావేశపు మందిరం నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పెద్దాపురం సమితి యూనిట్ ఎన్నికలు గురువారం జరిగాయి. ఈ ఎన్నికల పరిశీలకులుగా మరియు సమన్వయకర్తలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జగన్నాథం, జనరల్ సెక్రటరీ జ్యోతుల రాంబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ రత్నంరాజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొనగా, వీరి సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల పెద్దాపురం సమితి యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ సంఘం యొక్క ముఖ్య ఉద్దేశాలు, సంఘం ఉపయోగాలు, సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల పెద్దాపురం కార్యవర్గానికి వారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అధ్యక్షులుగా ఎన్.వి.వి.ప్రసాద్, సెక్రటరీగా టి.శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.ప్రకాశరావు, ట్రెజరర్‌గా జి.రాజా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.అభిషేక్, ఉపాధ్యక్షులుగా ఎస్.సంజీవ్ కుమార్, ఎస్.మహేష్ బాబు,వి.లోవరాజు,కె.వీరబాబు,బి.ఈశ్వరరావు,కె.సుస్మన్, బి.రఘు స్రవంతి, జాయింట్ సెక్రటరీలుగా ఎన్.సతీష్ కుమార్, కె.సింధు, వి.రామతులసి, విజయ్‌కుమార్, సంతోషి అపర్ణ, టి.సుజాత, శ్రీదేవి, తదితరులు ఎన్నికయ్యారు.

## దోమల మందు పిచికారి అన్ని గ్రామాల్లో జరిగేలా చూడాలి

**- ఎంపీడీవో యాదగిరేశ్వరరావు**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రాజవమ్మంగి ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీడీవో యాదగిరేశ్వరరావు అధ్యక్షతన దోమల మందు పిచికారి గురించి మలేరియా అధికారులు అవగాహన కల్పించారు. గురువారం మలేరియా వ్యాధి నిర్మూలనలో భాగంగా ఏ సి ఎం 5/- (ఆల్ఫా సైపర్ మెత్రిన్ ) అనే దోమల మందు పిచికారీ గురించి ట్రయినింగ్ ఇవ్వటం జరిగింది. మందు ఎలా వాడాలి, ఎంత మందు కలపాలి, ఎలా ఎక్కడ పిచికారీ చేయాలి అనే విషయాల గురించి మలేరియా సబ్ యూనిట్ అధికారి చీడిపల్లి ప్రసాద్, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ పల్లాల సోమరాజు రెడ్డి ట్రయినింగ్ ఇవ్వటం జరిగింది. దోమల మందు పిచికారీ అన్ని గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు,అంగన్వాడి కేంద్రాలు,గృహాలలో జరిగేటట్టు చూడాలని ఎంపీడీవో అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సీడీపీఓ దేవమణి,ఎంఈఓ సూరయ్యరెడ్డి,సిహెచ్ఓ పద్మావతి, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్,సూపర్వైజర్ సుధాకర్, ఎంఎల్ హెచ్‌పిలు, పీహెచల అసిస్టెంట్‌లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.